వరికి ఊతమివ్వని వర్షాలు..!

- మెట్టలో ఈసారి ఖరీఫ్ పనులు ఆలస్యమే..
- ప్రారంభం కాని నాట్లు
- దమ్ము చేసే పనిలో నిమగ్నమైన రైతాంగం



నారాయణపురంలో సాగు భూమిని ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న రైతు



ఎం.నాగులపల్లిలో వేసిన నారు

ద్వారకాతిరుమల: ఖరీఫ్ సాగుకు వర్షాలు ఊతమివ్వడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న చదురు మదురు వానలు సాగుకు ఏమాత్రం సరిపోవడం లేదు. దాంతో మెట్ట ప్రాంతంలో సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ద్వారకాతిరుమల మండలంలో రైతులు భూమిని దమ్ము చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ లక్ష్యం 4,800 ఎకరాలుగా వ్యవసాయ అధికారులు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా రైతులు 160 ఎకరాల్లో వరి నారును వేశారు. అయితే ముమ్మరంగా నాట్లు జరగాల్సిన ఈ సమయంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నాట్లు ఆలస్యమయ్యాయి. మెట్ట ప్రాంతంలో దాదాపుగా అన్ని చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం గొల్లగూడెం, సూర్యచంద్రరావుపేట, ఎం.నాగులపల్లి, నారాయణపురం, పి.కన్నాపురం, శరభాపురం, ఐఎస్.రాఘవాపురం, ఐఎస్.జగన్నాధపురం, రామసింగవరం తదితర గ్రామాల్లోని పొలాలను రైతులు దమ్ములు చేస్తున్నారు. ఆశించిన మేరకు వర్షాలు కురవకపోతే ఈ సారి మెట్టలో సాగు పనులు ఆలస్యం అవుతాయని అటు వ్యవసాయాధికారులు, ఇటు రైతులు వాపోతున్నారు. రైతులకు సాగు విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అధికారులు అంటున్నారు.

వర్షాల కోసం ఎదురు చూపులు..

ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పనులకు ఏ మాత్రం ఊతమివ్వడం లేదు. దాంతో మెట్ట ప్రాంత రైతాంగం అయోమయంలో పడింది. వరుణదేవుడు కరుణిస్తాడో లేదోనన్న అనుమానంతో రైతులు సతమతమవుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు బోర్లు ఆధారంగా వ్యవసాయాన్ని చేస్తున్నప్పటికీ, భూగర్భ జలాలు అడుగంటడంతో అవి సాగుకు సరిపడా నీటిని అందించలేక పోతున్నాయి. దాంతో వర్షపు నీరు తోడైతేనే గాని సజావుగా సాగు జరిగే పరిస్థితులు కనబడటం లేదు.

జూలై నెలాఖరుకు నాట్లు పూర్తవుతాయి



వర్షాలు ముమ్మరంగా కురిస్తే జూలై నెలాఖరు నాటికి నాట్లు పూర్తవుతాయి. లేకుంటే సాగు మరింత ఆలస్యం అవుతుంది. ప్రస్తుతం నాట్లు వేసే పనులు కాలువ కింద జరుగుతున్నాయి. మెట్టలో ఇంకాస్త సమయం పడుతుంది. ద్వారకాతిరుమల మండలంలో అధిక శాతం మంది రైతులు ఎంటీయూ 1061, పీఎల్‌ఏ 1100, స్వర్ణ, సంపద స్వర్ణ రకాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

– ఎ.దుర్గారమేష్, మండల వ్యవసాయాధికారి, ద్వారకాతిరుమల

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో...



తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టికి శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు, ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

5.20 లక్షల మందికి ఉపాధి పనులు



ఏపీఓ రామ్‌జీ

దెందులూరు: దెందులూరు మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జాతీయ ఉపాధి హామీ పథకంలో 5.20 లక్షల మందికి ఉపాధి పని కల్పించామని దెందులూరు మండల ఏపీఓ దశరద రామ్‌జీ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ చెరువుల్లో మట్టి తీయడం, గట్లు పటిష్ట పరచడం, సప్లయ్ ఛానల్స్ ఏర్పాటు తదితర పనులు ఉపాధి కూలీలు చేస్తున్నారన్నారు. సకాలంలో వేతనాలు ఆన్‌లైన్ విధానంలో వారి ఖాతాలకు జమ అవుతున్నాయన్నారు.

40 షెడ్ల నిర్మాణం పూర్తి



రామారావుగూడెంలో నిర్మించిన మల్బరీ షెడ్డు

దెందులూరు: దెందులూరు మండలంలో 40 మల్బరీ షెడ్ల నిర్మాణం పూర్తయ్యాయని పట్టు పరిశ్రమల శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ టి.రత్తయ్య చెప్పారు. ఆదివారం రామారావుగూడెంలో నిర్మాణం పూర్తయిన సాగులో ఉన్న మల్బరీ షెడ్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నూరు శాతం సబ్సిడీతో మల్బరీ సాగుకు ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం బాధాకరం



పోకల రాంబాబు

దెందులూరు: తాడేపల్లిలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని హైకోర్టు ప్రొసిడింగ్స్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తెల్లవారుజాము జేసీబీలతో కూల్చివేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు, దెందులూరు నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు గడవక ముందే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రజలందరూ కూటమి ప్రభుత్వ చేష్టలను పరిశీలిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కుట్రపూరిత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం ఒడి కట్టకూడదని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ కమిటీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు అన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ఉంగుటూరు తూర్పు కాలవగట్టు వద్ద ఉన్న ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే పి.ధర్మరాజు సందర్శించుకుని పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా వచ్చిన ఆయనకు ఆలయ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. రామచంద్రపురంలో నీలాలమ్మ జాతరలో ధర్మరాజు పాల్గొని పూజలు చేశారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం వృద్ధి

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రంథాలయాల్లో చేపట్టిన చదవడం మాకిష్టం అనే కార్యక్రమంతో విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని పెదవేగి శాఖ గ్రంథాలయాధికారి తోట అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు అరుణ్‌కుమార్ వివిధ రకాల విజ్ఞాన భరిత పుస్తకాలను ఇచ్చి చదివించారు. ప్రముఖుల జీవిత చరిత్రలను చిన్నారులకు వివరించి, వారిలో నూతనోత్సాహాన్ని నింపారు.

'మానవత' నూతన కార్యవర్గం



మానవత పోలవరం శాఖ నూతన కార్యవర్గం

పోలవరం రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పోలవరం శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ రీజినల్ చైర్మన్ చంద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నూతన కార్యవర్గంలో పి.పోసిబాబును సంస్థ పోలవరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడిగా శేఖర్‌బాబు, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎస్.నారాయణ, జాయింట్ సెక్రటరీ సిద్ధా రామకృష్ణ, బోర్డు డైరెక్టర్లుగా కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, చిలక రాంబాబు, ఆకుల నరసింహమూర్తి, ఈసీ మెంబర్లుగా మద్దు పోశీ నాగేశ్వరరావు, సొబ్బన మోహన్, ఎస్.వెంకట్రావు, ఎస్‌కేఎస్ బాషా ఎన్నికయ్యారు. చైర్మన్ చంద్రయ్య నూతన వర్గంతో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలి



జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు)ను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సందర్శించారు. స్కూలు విద్యార్థులు డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠ్యపుస్తకాలు సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముత్తారెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, హెచ్ఎం కేఎస్ఎల్‌వీ కుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక, శారీరక దృఢత్వం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి వ్యక్తి యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని తద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఆరోగ్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. నగరానికి చెందిన ఫ్లాష్ టీమ్ ఆధ్వర్యంలో స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జయహో యోగా కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన వల్ల మానసిక, శారీరక దృఢత్వం మెరుగుపడుతుందన్నారు. యోగా, ధ్యాన సాదన జ్ఞాపక శక్తిని మరింతగా పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లాష్ టీమ్ ప్రతినిధి శ్రీనివాస్, కొమ్మ నాగరాజు, ఎస్‌కే సత్తార్, జంపా సూర్యనారాయణ రావు, గొంతిన రామకృష్ణ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



జంగారెడ్డిగూడెం: ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు



కొయ్యలగూడెం: రాజవరంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. స్థానిక మణికంఠ డయోగ్నోస్టిక్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మాతృసంస్థ జనసంగ్ వ్యవస్థాపకులుగా, సామాజిక కార్యకర్తగా శ్యాంప్రకాష్ ముఖర్జీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి బ్రహ్మాజీరావు, బుచ్చయ్య సిద్ధాంతి శర్మ, రామారావు, కొనకళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రాజవరం గ్రామంలోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కొయ్యలగూడెం, బయ్యనగూడెం, కన్నాపురం గ్రామాలలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చేసిన సేవలను బీజేపీ నాయకులు కొనియాడారు.

దుర్గారావుకు మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



దుర్గారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: మండలంలోని కోటనాగవరం సర్పంచ్ తెల్లం వెంకటలక్ష్మి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తెల్లం దుర్గారావును కె.అంకంపాలెంలో ఆయన స్వగృహం వద్ద ఆదివారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. దుర్గారావు కిడ్నీకి సంబంధించిన సమస్యతో డయాలసిస్ తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న బాలరాజు ఆయన్ను పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని త్వరలోనే కోలుకుని మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీటీసీలు అల్లూరి రామ్మోహన్‌రావు, తెల్లం రమణ, గాలి దుర్గారావు, నాయకులు తెల్లం చిన్నారావు, కొవ్వాసి పోసీరావు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతి

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని, రెండు వారాలుగా తాము ఆందోళన చేస్తున్నా ఇంతవరకూ యాజమాన్యం స్పందించలేదని గణపవరం సీపీఎఫ్ ఉద్యోగులు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు మొర పెట్టుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా లాభాల్లో ఉన్న కంపెనీని అర్ధాంతరంగా మూసివేసి తమను వీధుల పాలు చేశారని ఉద్యోగులు వాపోయారు. వారం రోజులుగా రాజమండ్రిలోని సీపీఎఫ్ కంపెనీ గేటు ముందు ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించడంలేదని ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఈ విషయంలో ఉద్యోగులకు న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని, కంపెనీ బాధ్యులతో మాట్లాడతానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా..!



కుక్కునూరు: ఎంపీడీఓ కార్యాలయం పక్కన వాననీటితో నిండిన గొయ్యి



కొయ్యలగూడెం: కృష్ణంపాలెంలో మట్టి కోసం నందనాల చెరువును తవ్వేసిన దృశ్యం

కుక్కునూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే గుంతను తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో గొయ్యి మొత్తం వాననీటితో నిండింది. దీంతో అక్కడ గొయ్యి ఉన్న విషయం స్థానికంగా ఉన్న వారికి తప్ప ఇతరులకు తెలియదు. ఆ సమీపంలోనే వెలుగు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు ఉన్నాయి. గొయ్యి విషయం తెలియక ఎవరైనా అటుగా నడిచి వెళ్లినా, వాహనాలను పార్కింగ్ నిమిత్తం తీసుకెళ్లినా గొయ్యిలో పడే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చించాలని, ఈలోగా కనీసం అక్కడ గొయ్యి ఉందని అని సూచిక బోర్డును ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి కోసం తవ్వి వదిలేశారు

కొయ్యలగూడెం: నందనాలు చెరువులో ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చి పశువులను కాపాడాలని చెరువు ఆయకట్టు రైతాంగం ప్రభుత్వానికి వేడుకోలు చేసింది. కృష్ణంపాలెం, కేతవరం గ్రామాల మధ్య ఉన్న అతిపెద్ద సాగునీటి చెరువు అయిన నందనాల చెరువులో పది రోజుల క్రితం మట్టి అక్రమార్కులు భారీగా ట్రక్కులలో మట్టిని జేసీబీల ద్వారా తోడి తరలించారని రైతులు పేర్కొంటున్నారు. ఆ సమయంలో సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి స్పందించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంతో మట్టి అక్రమ రవాణా ఆగిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో మట్టి తరలించడానికి కారకులైన వారిని గుర్తించి ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని పూడ్చించే బాధ్యతను కూడా వారికి అప్పగించారని రైతులు పేర్కొన్నారు. అయితే వారు భారీ గొయ్యిని పూడ్చకపోవడంతో పశువులకు ప్రమాదకరంగా మారిందన్నారు. దాహార్తి కోసం వచ్చే పశువులు భారీ గొయ్యిలో పడితే ఏం ప్రమాదం ముంచుకొస్తుందో అంటూ రైతులు బెంబేలెత్తుతున్నారు. దీనిపై ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు విన్నవిస్తున్నారు.

జేసీ కోర్టు ఆదేశాలను అమలు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దోసపాడు పేదల ఇళ్ల కోసం జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రెవెన్యూ అధికారులు వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి, జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. దోసపాడు పేదలకు అనుకూలంగా కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అన్నే భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోసపాడు పేదలు, దళితుల అసైన్మెంట్ భూములను అసలైన అసైన్మెంట్‌దారులకు పంచాలని జేసీ కోర్టు ఆదేశాలు విడుదల చేసిందని తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పటికైనా అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సక్షమ్ సేవలు అభినందనీయం

భీమడోలు: దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న సక్షమ్ సేవలు అభినందనీయమని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలులో సక్షమ్ సంస్థ ధ్వర్యంలో ఆదివారం సక్షమ్ స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తూ సకలాంగులతో సమానంగా అన్నింటినీ అందిపుచ్చుకుంటున్నారన్నారు. అలాంటి దివ్యాంగులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తున్న సక్షమ్ సేవలను కొనియాడారు. దివ్యాంగులకు ప్రభుత్వ ప్రోత్సాహం తోడు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకుంటున్నాయన్నారు. వికలాంగత్వం శరీరానికేకాని మనస్సుకు కాదన్నారు. ఆత్మస్థైర్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగితే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. దివ్యాంగులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. నేటి సమాజంలో ప్రజలు వికలాంగుల పట్ల ప్రేమానురాగాలు చూపుతున్నారన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆదుకుంటున్న, సేవలందిస్తున్న సక్షమ్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, సక్షం రాష్ట్ర సభ్యుడు సీహెచ్ జగన్నాథం, లయన్స్ క్లబ్ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు పీవీ సత్యనారాయణ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విహంగాల సవ్వడి.. పర్యాటకులకు కనువిందు

- ఏలూరు సమీపంలోని మాధవాపురంలో పక్షుల విడిది కేంద్రం
- ఆకట్టుకుంటున్న మౌలిక వసతులు
- పెరుగుతున్న సందర్శకుల సంఖ్య



మాధవాపురం వద్ద కొల్లేరు పక్షుల విడిది కేంద్రం ముఖద్వారం




మాధవాపురం పక్షుల విడిది కేంద్రంలో గూడు కట్టుకుంటున్న పక్షులు (ఫైల్)



కొల్లేరులో విస్తారంగా ఉన్న కొంగలు

ఏలూరు రూరల్ : పక్షుల కిలకిల రాగాలు మనస్సును ఎంతో పులకింప జేస్తుంది. విహంగాల సవ్వడులు చూసి తన్మయత్వం చెందని వారుండరు. అవి పర్యావరణానికి ఎంతో మేలు చేయడంతోపాటు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తాయి. ఏలూరు నగర వాసులను స్థానికంగా ఏర్పాటు చేసిన కొల్లేరులో పక్షుల విడిది కేంద్రం ఆకట్టుకుంటోంది. నగరానికి 15 కిలోమీటర్ల దూరం మాధవాపురం వద్ద అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన పక్షుల విడిది కేంద్రం సెలవు రోజుల్లో పర్యాటకులతో కిటకిటలాడుతోంది. పాఠశాల, ప్రభుత్వ కార్యాలయం సెలవు దినాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారు. వర్షాకాలం రావడంతో పక్షుల రాకతో కొల్లేరు ప్రాంతం సుందరంగా మారింది. ఫలితంగా ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి బాలబాలికలు, యువతీ, యువకులు కొల్లేరు సందర్శిస్తున్నారు.



తాగునీరు అందించే మొండికోడు రిజర్వాయర్



పర్యాటకుల కోసం ఏర్పాటుచేసిన బల్లలు



కొల్లేరు రిసార్ట్ వద్ద పిల్లల ఆటవిడుపు

పక్షుల కిలకిల రాగాలు

కేంద్రం వద్ద పర్యాటకులు పక్షులను తిలకించేందుకు అటవీశాఖ అధికారులు వాచ్ టవర్ ఏర్పాటు చేశారు. వివిధ రకాల పక్షుల జీవన శైలి తెలుసుకునేలా బోర్డులు అందుబాటులో ఉంచారు. పర్యాటకులు సేద తీరేందుకు హట్స్ ఏర్పాటు చేశారు. మరుగుదొడ్డి, తాగునీరు తదితర మౌలిక వసతులు అభివృద్ధి చేశారు.

- **బైనాక్యులర్లు ఏర్పాటు చేయాలి :** పక్షులను మరింత దగ్గరగా తీక్షించేందుకు అధికారులు బైనాక్యులర్లు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.
- **చిన్నారులను ఆకర్షిస్తున్న ఆట స్థలాలు**

పిల్లల కోసం ఆట స్థలాలను అభివృద్ధి చేశారు. ఇక్కడికి వచ్చిన పిల్లలు ఆటలతో సేద తీరుతున్నారు.

- **రిసార్ట్ నిర్మాణం**

ప్రభుత్వం ఇక్కడ పర్యాటకుల కోసం రిసార్ట్స్ నిర్మించింది. ఇందులో భోజనంతో పాటు కొల్లేరుకు చెందిన పలు రకాలు చేపల వంటకాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

- **ఆకట్టుకుంటున్న ఆధ్యాత్మిక నిర్మాణాలు**

గుడివాకలంకలో కనకదుర్గ ఆలయం, రామాలయాన్ని సందర్శకులు దర్శిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన కోటి రూపాయలతో నిర్మించిన చర్చి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. మొండికోడులో విశాలమైన రిజర్వాయర్‌ను పెద్దలు సందర్శిస్తున్నారు. ప్రత్తికోళ్లలంకలో 100 అడుగుల భారీ ఆంజనేయ విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. స్థానికంగా అభివృద్ధి చేసిన కొల్లేరు మల్లన్న ఆలయం చూసి తీరాల్సిందే. ఇక్కడ పరిసర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది.